www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 71 | 23-8-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్టమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ఫ్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన సీజేఐ



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



## మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

**ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం**

**మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు**

**హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం**

**మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్**

హైదరాబాద్

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసిం గ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్? నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్‌ఎం డీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ - మిగతా3లో

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

- విద్య, పరిశోధన, స్టార్టప్‌లపై భారీ ప్లాన్!
- సీఎం రేవంత్ కీలక చర్చలు!
- లండన్ కేంబ్రిడ్జ్ వర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ
- హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



హైదరాబాద్

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ వర్సిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రొగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో - మిగతా3లో



## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్ పండగ ముందు ప్రజలపై భారం'

- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఫైర్
- చక్కెర ధరలను పెంపుపై ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్
- పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపణ




## గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం



- ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి
- అలాంటి నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్
- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో కూలిన భవనం
- ఏడంతస్తుల భవనం కూలి పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై పడిన శిథిలాలు
- శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది
- పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ భవనంలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతులను ఉమేశ్ కారె, మోపత్‌గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వీరు టైల్స్ పనులు చేస్తూ కొండాపూర్?లో నివాసం ఉంటున్నట్లుగా గుర్తించారు.

# కాంగ్రెస్‌లో పాత రోజులు

- కాంగ్రెస్‌లో పతాక స్థాయికి చేరిన కుమ్ములాటలు
- "అంతర్గత ప్రజాస్వామ్యం" అనే ముసుగులో నేతలు హద్దులు దాటి బహిరంగ విమర్శలకు దిగడం ఇప్పుడు గాంధీభవన్‌ను కుదిపేస్తోంది
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదు
- కాంగ్రెస్‌లో ఎప్పటినుంచో రగులుతున్న 'వలస నేతలు వర్సెస్ ఒరిజినల్ కాంగ్రెస్' వివాదానికి ఇది పరాకాష్ట
- సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒంటబట్టలేదని, పార్టీ క్రమంగా 'టీడీపీ కాంగ్రెస్'గా మారుతోందంటూ వ్యాఖ్యలు



**హైదరాబాద్:** కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అని చెప్పుకుం టూ ఉంటారు. అసంతృప్తి ప్రకటనలు చేసే వారికి ఈ పేరు పెట్టుకున్నారు. ఇప్పుడీ కాంగ్రెస్ మార్క్ అంతర్గత ప్రజాస్వామ్యం హద్దులు దాటి పోతోంది. రాజగోపాల్ రెడ్డి నిరంతరం వివాదాస్పద ప్రకటనలు చేస్తున్నారు. అనిరుధ్ రెడ్డితో పాటు ఇటీవల చిన్నారెడ్డి కూడా అదే చేశారు. తాజాగా సుస్మితా పటేల్ సంచలనం సృష్టించారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర రాజకీయ కలకలాన్ని రేపాయి. సీఎం రేవంత్‌కు పార్టీ సిద్ధాంతాలు ఇంకా వంటబట్టలేదని, కాంగ్రెస్ క్రమంగా టీడీపీ కాంగ్రెస్ గా మారుతోందని ఆరోపిస్తూ ఆమె నేరుగా తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం కాంగ్రెస్ కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగిన ఒక కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ టికెట్ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. - మిగతా3లో

ఉద్యమ కెరటం
ఆదివారం
23 ఆగస్టు 2026

# న్యాయసేతు అనేది ఒక వారధి

స్థిరమైన ఆర్థిక వృద్ధి కేవలం భౌగోళిక లేదా ముడి సహజ వనరులపై మాత్రమే కాకుండా సంస్థాగత స్థిరత్వం, విశ్వాసం, సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. బ్రిక్స్ ప్లస్ దేశాలు మానవాళిలో 40శాతానికి పైగా, ప్రపంచ పీపీపీ ఉత్పత్తిలో దాదాపు 40శాతం వాటాను కలిగి ఉన్నాయని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక అని పేర్కొన్నారు. ఈ క్రమంలో చట్టబద్ధమైన పాలనకు సంబంధించిన 'న్యాయనామిక్స్', 'న్యాయసేతు' అనే పదాలను పరిచయం చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శనివారం దిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 'న్యాయ సేతు' (న్యాయ వారధి), 'న్యాయఆర్థిక శాస్త్రం' (న్యాయనామిక్స్) అనే కాన్సెప్ట్‌లను పరిచయం చేశారు. బ్రిక్స్ ప్లస్ దేశాలలో చట్టపరమైన, ఆర్థిక శక్తిని ఏకీకృతం చేసేందుకు 'న్యాయనామిక్స్', 'న్యాయ సేతు' దార్శనికత గురించి వివరించారు. 'బహుధ్రువ ప్రపంచంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జరిగిన ప్రారంభ ప్లీనరీలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "చట్టబద్ధమైన పాలన గురించి నేను ఒక పదాన్ని ఉదహరిస్తున్నాను. అదే న్యాయనమిక్స్. మరింత సరళంగా చెప్పాలంటే న్యాయ ఆర్థిక శాస్త్రం. ఈ న్యాయనామిక్స్ బ్రిక్స్ ప్లస్ దేశాలన్నింటికీ వర్తిస్తుంది. కేసులను డిజిటలైజ్ చేయడంలో భారతదేశానికి ఉన్న అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, న్యాయశాస్త్రానికి సంబంధించిన ఒక ఉమ్మడి భాండాగారాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా బ్రిక్స్ ప్లస్ దేశాల అధికార పరిధిలో వెలువడిన తీర్పు, అదే విధమైన చట్టపరమైన



ప్రశ్నలతో వ్యవహరించే ఇతర ప్రాంతాలలోని న్యాయస్థానాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. తద్వారా దిల్లీ, బ్రసీలియాలో రాసిన తీర్పు అదే ప్రశ్నను ఎదుర్కొంటున్న మరోచోట ఉన్న ధర్మాసనానికి తెలియజేయడానికి సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదు. 'న్యాయ సేతు' అనేది 11 న్యాయ సంప్రదాయాలను అనుసంధానించే ఒక వారధి."

### 'బ్రిక్స్ పరస్పర సహకారం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగింది'

బ్రిక్స్ దేశాల మధ్య బలమైన న్యాయ సహకారం అవసరాన్ని బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్. నాగానంద్ కూడా నొక్కి చెప్పారు. బ్రిక్స్ ఏర్పడినప్పుడు దాని ప్రధాన దృష్టి సభ్య దేశాల మధ్య ఆర్థిక, ద్రవ్య సహకారాన్ని బలోపేతం చేయడంపైనే ఉందని పేర్కొన్నారు. సంవత్సరాలుగా బ్రిక్స్ పరస్పర సహకారం, భాగస్వామ్యం కోసం మరింత విస్తృతమైన వేదికగా ఎదిగిందని గుర్తు చేసుకున్నారు. దీంతో ఆర్థిక సంబంధాలతో పాటు చట్టపరమైన సంబంధాలు కూడా అనివార్యంగా బలపడతాయని తెలిపారు. "బ్రిక్స్ న్యాయ వేదికను స్థాపించడం, అభివృద్ధి చేయడం చాలా అవసరం. ఇలా చేస్తే సమస్యలను సమష్టిగా పరిశీలించడానికి, ఒకరి న్యాయ వ్యవస్థలను మరొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరి అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవడానికి, అలాగే మన దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాన్ని ఎలా సరళంగా, మరింత ప్రభావవంతంగా కనుక్కోవచ్చో అన్వేషించడానికి ఒక అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ మారుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని దిల్లీలో ఒక బ్రిక్స్ మధ్యవర్తిత్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకుంది."

### భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు

2012, 2016, 2021లలో భారత్ బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించింది. 2026లో నాలుగోసారి ఈ శిఖరాగ్ర సదస్సుకు అధ్యక్షత వహించనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ న్యాయ ప్రముఖుల నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తంతో ఇండియా బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షత వహించనుంది. కాగా, బ్రిక్స్ కూటమిలో 2024లో ఇరాన్‌తోపాటు ఈజిప్టు, ఇథియోపియా, యూఏఈ దేశాలు చేరాయి. 2025లో ఇండోనేసియా కూడా బ్రిక్స్ కూటమిలో భాగమైంది. దీంతో ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రిక్స్ సభ్యదేశాల సంఖ్య 11కు చేరుకుంది.

# విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

సెప్టెంబర్ 1 నుంచి భారత విమానాశ్రయాల నుంచి బయలుదేరే అంతర్జాతీయ ప్రయాణికులు తమ బోర్డింగ్ పాస్‌లపై ఇమ్మిగ్రేషన్ అధికారులతో భౌతికంగా స్టాంప్ వేయించుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్టాంపింగ్‌కు బదులుగా విదేశాలకు ప్రయాణించే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కోసం తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఈ-బోర్డింగ్ పాస్‌ను చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అయితే ప్రయాణికులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను తీసుకురావొచ్చని, కానీ ఇమ్మిగ్రేషన్ అధికారులు వాటిపై స్టాంప్ వేయరని పేర్కొంది. ఈ మేరకు సంబంధిత అధికారులు వెల్లడించారు.

### ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని!

ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లు సమర్పించే విషయంలో ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతోందని, ఒక్కోసారి స్టాంపింగ్ తప్పిదాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ తెలియజేయడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలలో భౌతిక బోర్డింగ్ పాస్‌ల తప్పనిసరి అవసరాన్ని, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్‌ను తొలగించాలని కేంద్రం తాజాగా నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రయాణికుల తనిఖీ సమయంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్‌ఎఫ్) కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయదని స్పష్టం చేశారు. వాటిని కేవలం ఇమిగ్రేషన్ అధికారుల క్లియరెన్స్ కోసం మాత్రమే చూపించాల్సి ఉంటుందని వెల్లడించారు. భారత పాస్‌పోర్ట్ ఉన్న పౌరులకు కూడా బోర్డింగ్ పాస్‌లపై స్టాంపింగ్ తొలగింపు విషయంలో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టినట్లు వివరించారు.

### కేంద్ర సర్కార్ కొత్త రూల్స్ ప్రకారం

భారత్ నుంచి బయలుదేరే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో తమ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న ఈ-బోర్డింగ్ పాస్‌లను చూపించవచ్చు. అలా అని ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లను కలిగి ఉన్న ప్రయాణికులకు బోర్డింగ్ క్లియరెన్స్‌ను ఇస్తారు. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫిజికల్ బోర్డింగ్ పాస్‌లపై స్టాంపులు వేయరు. కాగా, సీఐఎస్‌ఎఫ్ కొన్నేళ్ల క్రితమే దేశీయ, అంతర్జాతీయ ప్రయా ణికుల బోర్డింగ్ పాస్‌లపై



స్టాంపులు వేయడాన్ని ఆపేసింది.

### మరో కీలక చర్యకు సిద్ధమవుతోందా?

అలాగే అంతర్జాతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మరో కీలక చర్యకు రెడీ అవుతోంది. భారతీయ పాస్‌పోర్ట్ కలిగిన ప్రయాణికుల రాకపోకల సమయంలో పాస్‌పోర్ట్‌లపై స్టాంపింగ్ వేసే విధానాన్ని కూడా పూర్తిగా తొలగించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి, ఆ తర్వాత దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అమలు చేయనుంది.

### పాస్‌పోర్టు ఫీజుల పెంపు

కాగా, పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం ఇటీవల సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంపు చేసింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేల ఫీజు కాగా, ఇక నుంచి రూ.3500 వసూలు చేయనుంది. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించింది. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా, అది రూ.1750కి పెరిగింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత పాస్‌పోర్ట్ ఫీజులు పెరిగాయి.

### ఇండియా పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే : కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం

భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని కేంద్ర విదేశాంగ శాఖ ఇటీవలే స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని పేర్కొంది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంపై అప్పట్లో మోదీ ప్రభుత్వంపై విపక్షాలు భగ్గుమన్నాయి.

# వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

వందేమాతరం విషయంలో కాంగ్రెస్ "బుజ్జగింపు రాజకీయాలకు" పాల్పడుతోందని బీజేపీ శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దిల్లీలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బీజేపీ పేర్కొంది. ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని "స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు. "2026 ఆగస్టు 22న వందేమాతరం పట్ల గౌరవం, దాని చారిత్రక వారసత్వ పరిరక్షణకు సంబంధించి ఒక ముఖ్యమైన తీర్మానాన్ని భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో



వందేమాతరం గీతాన్ని మొదటి రెండు చరణాలకే పరిమితం చేస్తూ 1937లో తీసుకున్న నిర్ణయాన్ని పునరుద్ఘాటిస్తూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆగస్టు 19, 2026న తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజకీయ ప్రయోజనాలు లేదా బుజ్జగింపుల కోసం వందేమాతరం గౌరవం, వారసత్వం విషయంలో ఎటువంటి రాజీని అంగీకరించబోము. వందేమాతరం సంపూర్ణ గేయ గౌరవం, హుందాతనం, వారసత్వం, జాతీయ స్ఫూర్తిని బీజేపీ కాపాడుతుంది. అలాగే, వందేమాతరాన్ని అత్యంత స్వచ్ఛమైన జాతీయ భావనతో ముడిపడి ఉన్న "సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదం"గా అభివర్ణిస్తూ మహాత్మా గాంధీ చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళుతుంది. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాముఖ్యత, వారసత్వాన్ని భారతదేశంలోని ప్రతి మూలకు చేరవేసేందుకు బీజేపీ ఒక ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. అంతేకాకుండా, వందేమాతరం ఆలపిం చడంపై ఆంక్షలు విధించిన చారిత్రక, రాజకీయ పరిస్థితులను అంటే ముస్లిం లీగ్ అభ్యంతరాలు, తదనంతరం పెరిగిన మతపరమైన, వేర్పాటువాద డిమాండ్ల రాజకీయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నిర్ణయించింది. 1947లో భారతదేశ స్వాతంత్ర్య విజయ నినాదం 'వందేమాతరం'. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటి 'అభివృద్ధి చెందిన భారతదేశం' (వికసిత్ భారత్) గొప్ప ప్రకటనకు కూడా 'వందేమాతరం' నినాదమే కానుంది." కాంగ్రెస్ పార్టీ లేదా దాని వర్కింగ్ కమిటీ గానీ తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్ర అన్నారు. "ఈ రోజు నేను దేశాన్ని అడగదలుచుకున్నాను. పార్లమెంట్ గొప్పదా లేక జఔజ గొప్పదా? దేశం పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాల ఆధారంగా నడుస్తుందా లేక జఔజ ఆమోదించిన నిర్ణయాలు, తీర్మానాల ఆధారంగా నడుస్తుందా? ఏ కుటుంబం, ఏ రాజకీయ పార్టీ, ఏ వ్యక్తి కూడా దేశ చట్టం, దేశ రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే తాము గొప్పవారమని భావించకూడదు. జఔజ తన కార్యాలయంలో కూర్చుని, తమను తాము పార్లమెంట్ కంటే గొప్పగా భావించకూడదు. పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి అత్యున్నత దేవాలయం. పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయమే దేశ నిర్ణయం. వందేమాతరం దేశ గేయం. అది దేశ మంత్రం. హిందువులు, ముస్లింల మధ్య విభజన సృష్టించడానికి ఇది ఒక సాధనం కాదు. కాంగ్రెస్ విభజన బీజాలు నాటడానికి ప్రయత్నిస్తోంది. దీన్ని మేము జరగనివ్వము." అని సంబిత్ పాత్ర అన్నారు.

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

'న్యాయమూర్తులు దేవుళ్లు కాదు. ప్రతి తీర్పునూ కచ్చితంగా సరైనదిగా ఇవ్వలేం' అని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ అన్నారు. న్యాయవ్యవస్థలో వినయం, బాధ్యత, మానవీయ కోణం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శనివారం సుప్రీంకోర్టులో తన చివరి పని రోజున ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా భావోద్వేగంతో కీలక వ్యాఖ్యలు చేశారు. 'రాజ్యాంగం, న్యాయమూర్తులు కేవలం చట్టాన్ని సరిగ్గా వర్తింపజేయాలని మాత్రమే కోరడం లేదు. చట్టాన్ని న్యాయబద్ధంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. కోర్టుకు వచ్చే ప్రతి వ్యక్తిని కేవలం పిటిషనర్‌గా కాకుండా ఒక మనిషిగా చూడాల్సిన అవసరం ఉంది. ఒక పిటిషన్ కేసుకు సంబంధించిన వాస్తవాలను మాత్రమే చెబుతుంది. కానీ కోర్టును ఆశ్రయించిన వ్యక్తి ఇప్పటికే ఏం కోల్పోయాడు? తనకు కోర్టు నుంచి ఏం ఆశిస్తున్నాడు? వంటి విషయాలను అది చెప్పదు. అందుకే న్యాయమూర్తికి వినయం అవసరం' అని జస్టిస్ కరోల్ తెలిపారు.

### 'కోర్టులో మాటలే కాదు, మౌనం కూడా ముఖ్యం'

దాదాపు నాలుగు దశాబ్దాల తన న్యాయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్నారు జస్టిస్ కరోల్. సుమారు 40 ఏళ్లపాటు కోర్టు గదుల్లో గడిపినట్లు తెలిపారు. తొలుత న్యాయవాదిగా, ఆ తర్వాత 19 ఏళ్లపాటు న్యాయమూర్తిగా సేవలందించానని చెప్పారు. కోర్టులో వినిపించే వాదనలతో పాటు మౌనంలో దాగి ఉన్న మాటలను కూడా న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలని అన్నారు. న్యాయ ప్రక్రియలో న్యాయవాదులు చేసే వాదనలే కాకుండా, మాటల మధ్యలో బాధితులు కోరుకునేది ఏమిటో గుర్తించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. 1996లో తొలిసారి సుప్రీంకోర్టు మొదటి నంబర్ కోర్టులోకి వెళ్లిన గుర్తు చేస్తూ, అప్పట్లో న్యాయమూర్తుల బెంచ్ దాదాపు ఆరు అడుగుల ఎత్తులో ఉన్నట్లు తనకు అనిపించిందన్నారు. కింద నుంచి చూస్తే ఆ ఎత్తు అధికారానికి ప్రతీకగా కనిపించవచ్చని, కానీ న్యాయమూర్తిగా ఆ స్థానంలో కూర్చున్నప్పుడు అది గౌరవం, నిజాయితీతో కూడిన బాధ్యతకు ప్రతీక అని అర్థమైందన్నారు.

### సాధారణ పౌరుడి విశ్వాసమే సుప్రీంకోర్టు బలం

సుప్రీంకోర్టు గొప్పతనం కేవలం కీలకమైన కేసుల్లో వెలువడే తీర్పుల్లో లేదని జస్టిస్ కరోల్ అన్నారు. న్యాయం జరుగుతుందనే నమ్మకంతో కోర్టు గడప తొక్కే సాధారణ పౌరుడి విశ్వాసమే దాని అసలైన బలమని పేర్కొన్నారు. అయితే న్యాయం చాలా దూరంగా ఉందని, ఖరీదైనదని లేదా భయపెట్టేదిగా భావించి కోర్టుల గడప తొక్కలేని వారిని కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం, న్యాయ ప్రక్రియ, రాజ్యాంగబద్ధత వంటి భావనలను అర్థం చేసుకోవడానికి ధర్మం అనే భావనను ఉదాహరణగా తీసుకోవచ్చని జస్టిస్ కరోల్ అన్నారు. ఇక్కడ ధర్మం అంటే ఆచారం కాదని, విధి, బాధ్యత అని వివరించారు. కోర్టు ముందు నిలబడే వ్యక్తి ఎంత చిన్నవాడైనా, ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉన్నా అతడి మాటను న్యాయమూర్తి వినాలని చెప్పారు. న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించడమే న్యాయమూర్తి ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు.

### 'ప్రతి ఒక్కరూ తమ నిర్ణయాలకు న్యాయమూర్తులే'

న్యాయవ్యవస్థలోని బాధ్యతలు కేవలం కోర్టు గదులకే పరిమితం కావని జస్టిస్ కరోల్ అన్నారు. ప్రతి వ్యక్తి తన నిర్ణయాలు, ప్రవర్తన, అధికార వినియోగంపై తానే న్యాయమూర్తిగా వ్యవహరించాల్సి ఉంటుందని సూచించారు. 'న్యాయమూర్తి వస్త్రాలు ధరించే ముందు కూడా న్యాయమూర్తే. వాటిని తొలగించిన తర్వాత కూడా న్యాయమూర్తే' అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్?కు కేవలం ఒక రాజ్యాంగం ఉండటమే కాదు, దానిని మన జీవితాల్లో ఆచరించాల్సిన అవసరం ఉందని జస్టిస్ కరోల్ అన్నారు. రాజ్యాంగం గొప్పతనం పెద్ద పెద్ద కేసుల్లోనే పరీక్షకు గురికాదని, సాధారణ పౌర జీవితంలోని ప్రతి చర్యలోనూ అది ప్రతిబింబించాలని పేర్కొన్నారు.

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'




దేశీయ మార్కెట్లో చక్కెర ధరల పెరుగుదల, కొరత నేపథ్యంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మోదీ ప్రభుత్వం విధానాల వల్ల పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపించింది. 'మోదీ ప్రభుత్వ విధానాల్లోని చేదు, చక్కెరలోని మాధుర్యానికి పాకింది' అని కాంగ్రెస్? జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ఆయన శనివారం చేసిన ఎక్స్‌లో ఒక పోస్టు పలు ప్రశ్నలు సంధించారు. "మోదీ ప్రభుత్వానికి నేను సూటిగా మూడు ప్రశ్నలు అడుగుతున్నా. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు గత 9 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి ఎందుకు పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, 10 లక్షల టన్నుల చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునే స్థాయికి మనం ఎలా చేరుకున్నాం?. ఇక రెండోది, మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందు ప్రజలపై ఇంత భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? ముడోది, దేశంలో చక్కెర కొరత ఉన్నప్పుడు, ప్రభుత్వం విదేశాల నుంచి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, జు20 కోసం ఇథనాల్ ఉత్పత్తి చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'?" కాగా, దేశంలో చక్కెర ధరలు పెరగడానికి ఇథనాల్ కారణమని వస్తున్న ఆరోపణలను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఖండించింది. జులై 20న కిలోకు రూ. 48గా ఉన్న చక్కెర ధరలు ఆగస్టు 20 నాటికి కిలోకు రూ. 55కి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని, ఇథనాల్ మళ్లింపు కాదని స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా 2022-23లో సుమారు 12 శాతం నుంచి 2025-26 నాటికి సుమారు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. అదే సమయంలో దేశంలోని మొత్తం ఇథనాల్ ఉత్పత్తిలో దాదాపు ముప్పావు వంతు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని వివరించింది. ఊహించిన దానికంటే తక్కువ దేశీయ ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, వాతావరణ సంబంధిత కారణాల వల్ల ధరలు పెరిగాయని ప్రభుత్వం పేర్కొంది. అదే సమయంలో దేశీయ వినియోగానికి సరిపడా చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నా, కృత్రిమ కొరత సృష్టిస్తూ మిల్లర్లు, వ్యాపారులు ధరలను అడ్డగోలుగా పెంచారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిల్వదారులు, బ్లాక్ మార్కెటర్లు, స్పెక్యులేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్కెట్‌లో చక్కెర కొరతను నివారించేందుకు కేంద్రం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. చక్కెర సరఫరా పెంచడం, కృత్రిమ కొరతను నివారించడం, ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా నిల్వలపై ఆంక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ విక్రయించే, వినియోగించే పెద్ద వ్యాపారులు, పరిశ్రమలు తమ వద్ద 15 రోజులకు సరిపడా నిల్వలనే ఉంచుకోవాలని ఆదేశించింది. మిఠాయిలు, ఇతర పదార్థాలు, శీతల పానీయాల తయారీదారులు, ఆహారశుద్ధి యూనిట్లు, అమ్మకం దారులు, ఇతర సంస్థాగత కొనుగోలుదారులపై ఈ ఆంక్షలు విధించింది. నవంబరు 30 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని కేంద్రం తెలిపింది. చక్కెర కొరత రాకుండా ముడి పంచదారను 10 లక్షల టన్నుల మేర అక్టోబరు 31 లోపు దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. గతేడాది ఇదే సమయంలో టన్ను 3 వేల 900 రూపాయులగా ఉన్న పంచదార ధర ఇప్పుడు 5,400 - 5,500 స్థాయికి చేరిన నేపథ్యంలో కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత విదేశాల నుంచి చక్కెర దిగుమతులకు కేంద్రం అవకాశం కల్పించడం గమనార్హం.

# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ భవనంలో ప్లంబింగ్ పనులు చేస్తున్న ఇద్దరు శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న ఫైర్, డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద నుంచి రెండు మృతదేహాలను వెలికి తీశారు. నాలా పక్కనే 50 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన ఈ బిల్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతులను ఉమేశ్? కారె, మోపత్?గా పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్?కు చెందిన వీరు టైల్స్? పనులు చేస్తూ కొండాపూర్?లో నివాసం ఉంటున్నట్లుగా గుర్తించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు సీఎంసీ, హైడ్రా కమిషనర్లు సృజన, రంగనాథ్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. కూలిపోయిన భవన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



### కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తాం

ఘటనాస్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 50 గజాల్లో ఏడంతస్తులు కట్టారని, దానిపైన పెంట్?హౌస్? కూడా వేస్తున్నారన్నారు. భవనం కూలి ఇద్దరు చనిపోయారని వివరించారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయన్నారు. ఇక్కడి భవనాల్లో చాలావాటికి సెట్‌బ్యాక్‌లు లేవని రంగనాథ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలను కూల్చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడి భవనాలు హాస్టల్స్ కోసం వాడుతున్నారన్నారు. బిల్డర్ సాజిద్ కట్టే భవనాలన్నీ ఇలాగే ఉన్నాయని స్థానికులు చెప్తున్నారన్నారు. కొద్ది రోజుల్లో ఈ భవనాలన్నీ కూల్చేస్తామని తెలిపారు. ఈ భవనాలన్నీ ఖాళీ చేయాలని యజమానులకు సూచిస్తున్నామని చెప్పారు. నాలాను ఆక్రమించి భవనాలను ఇష్టానుసారంగా కట్టారని రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్యనగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

### అక్రమ నిర్మాణాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్?

ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎంసీ కమిషనర్ సృజన : భవనం కూలి ఆ శిథిలాలు పక్కనే ఉన్న మరో అపార్ట్?మెంట్?పై పడటంతో ఇద్దరు వృద్ధులు గాయపడ్డారు. అపార్ట్?మెంట్ గోడలు సైతం ధ్వంసమయ్యాయి. పక్కనే ఉన్న ఓ హాస్టల్? విద్యార్థులు భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. మరోవైపు ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ సృజన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంకా శిథిలాల కింద ఎవరైనా చిక్కుకొని ఉన్నారేమోనన్న అనుమానంతో ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ సాయంత్రం సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే ప్రాణనష్టం అధికంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్డీఆర్?ఎఫ్, ఫైర్?, పోలీసులు భవన శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రమాద ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి : గచ్చిబౌలిలో భవనం కూలి ఇద్దరు మృతిచెందిన ఘటనపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని సూచించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

### సీజ్ చేశాం, చర్యలు తీసుకొనే లోపే

4 నెలల ముందే భవన యజమానికి నోటీసులిచ్చామని సీఎంసీ కమిషనర్ సృజన వెల్లడించారు. భవనాన్ని సీజ్ కూడా చేశామన్నారు. భవన యజమాని ఈ మధ్యే పనులు మొదలుపెట్టినట్లు గుర్తించామని, చర్యలు తీసుకునే క్రమంలో భవనం కూలిపోయిందని కమిషనర్ సృజన వెల్లడించారు. "మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పెద్ద శబ్దం వినిపించింది. ఏమైందని భయటకు వచ్చి చూస్తే భవనం కూలినట్లుగా తెలిసింది. బిల్డింగ్?లోని నాలుగో ఫ్లోర్?లో ఉన్న ఓ వ్యక్తిపై భవన శిథిలాలు పడి గాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రిలో చేర్పించాం. ఈ ప్రమాదం సాయంత్రం సమయంలో జరిగి ఉంటే పెద్ద ఎత్తున నష్టం జరిగి ఉండేది. కూలిన బిల్డింగ్ శ్లాబ్? ప్రమాదకర పరిస్థితిలో వేలాడుతోంది. ఆ శిథిలాలను వేగంగా తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి" – స్థానికుడు

### బిల్డర్ కోసం గాలింపు!

అనుమతి లేకుండా బిల్డింగ్? నిర్మించారని, నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సరైన ప్రమాణాలు లేకుండా తక్కువ వ్యవధిలోనే నిర్మించడం వల్లనే పేకమేడలా కూలిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఈ భవనం నిర్మాణం చేస్తున్న బిల్డర్ సాజిద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నాడని తెలిసింది. పోలీసులు అతడికోసం గాలిస్తున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్‌లో పాత రోజులు

-మొదటిపేజీ తరువాయి

మాకు టికెట్ నిరాకరించడానికి అసలు రేవంత్ రెడ్డి ఎవరు? టికెట్ల కేటాయింపు అధిష్టానం పరిధిలోని అంశం అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నుంచి తాను స్వతంత్రంగానైనా పోటీ చేసి గెలిచి తీరుతానని సవాల్ విసిరారు. ఆనాడు రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడు కావాలని మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేస్తూ, కొడంగల్‌లో ఓడిపోయిన విషయాన్ని సీఎం మరిచి పోవద్దంటూ అత్యంత ఘాటైన స్వరంతో విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి ఏ స్థాయికి చేరిందో స్పష్టంచేస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, చిన్నారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి వంటి కీలక నేతలు ఇదివరకే వేర్వేరు సందర్భాల్లో తమ అసంతృప్తిని వెళ్లగక్కగా, ఇప్పుడు కొండా సురేఖ కుటుంబం నేరుగా సీఎంపైనే విమర్శల బాణాలు విసరడం శాసనసభా పక్షంలో సంచలనంగా మారింది. పార్టీలోని పాత కాంగ్రెస్ నేతలు, బీసీ నాయకులను పక్కనబెట్టి, వలస నేతలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఈ వరుస తిరుగుబాట్లకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోవైపు పీసీసీ క్రమశిక్షణా కమిటీ , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిస్సహాయంగా మారిపోయారు. బహిరంగంగా పార్టీ సిద్ధాంతాలను, ముఖ్యమంత్రి నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతలపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేకపోవడం పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. రాబోయే రోజుల్లో క్రమశిక్షణ తప్పితే చర్యలు ఉంటాయని ఎంపీ మల్లు రవి వంటి నేతలు ప్రకటనలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసమ్మతి నేతలను అదుపు చేయడంలో గాంధీ భవన్ నాయకత్వం పూర్తిగా వెనుకబడి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనాపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నప్పటికీ, సొంత కేబినెట్ సహచరుల కుటుంబాల నుంచే వస్తున్న ఈ రకమైన తీవ్రమైన విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరిట సాగుతున్న ఈ ఘర్షణ వాతావరణం, ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు రాజకీయ ఆయుధంగా మారుతోంది. అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని పార్టీలోని అంతర్గత పోరుకు చెక్ పెట్టకపోతే, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ స్థిరత్వానికి మరియు క్రెడిబిలిటీకి పెద్ద సవాలుగా మారే ప్రమాదం ఉంది.

### రేవంత్ ఫెయిలవ్వుతున్నారా

తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పుడు పరిపాలన కంటే పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే పెను సవాలుగా మారుతున్నాయి. అధికారం చేపట్టిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన నాయకత్వం.. సొంత పార్టీలోని సీనియర్లు, వలస నేతల అసంతృప్తిని దారికి తేవడంలో మాత్రం తడబడుతోందనే వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధిష్టానాన్ని నేరుగా టార్గెట్ చేయకుండా, కేవలం సీఎం రేవంత్‌ను మాత్రమే కేంద్రబిందువుగా చేసుకుని నేతలు సాగిస్తున్న స్వరం రోజురోజుకూ శృతిమించుతోంది. ఎన్నికల సమయంలో తన అనుకూల వర్గానికి టికెట్లు ఇప్పించుకుని, వారిని గెలిపించుకున్నారనే ఆరోపణలు మొదటి నుంచీ రేవంత్‌పై ఉన్నాయి. ఆ సమయంలో అధికారమే లక్ష్యంగా అంతా సర్దుకుపోయినా, ప్రభుత్వం ఏర్పడ్డాక సీనియర్లను విస్మరిస్తున్నారనే భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసహనాన్ని పెంచింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడం, నామినేటెడ్ పదవుల జాప్యం, పార్టీలో ప్రాధాన్యం తగ్గడం వంటి అంశాలు అంతర్గత అసంతృప్తిని రాజేస్తున్నాయి. కేబినెట్ పదవి ఆశించి భంగపడ్డ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మొదటి ఏడాది నుంచే సీఎంను లక్ష్యంగా చేసుకుని గళమెత్తుతున్నారు. సీఎం మార్పు ప్రస్తావన తెస్తూ, ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడం ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారితీస్తోంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి సీనియర్లు నిధుల కొరత, నిర్లక్ష్యంపై బహిరంగంగానే పెదవి విరుస్తున్నారు. దానం నాగేందర్ లాంటి నేతలు గత పాలనను ప్రస్తావిస్తూ ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ నేత చిన్నారెడ్డి టికెట్ల కేటాయింపు వ్యవహారాలపై విమర్శలు గుప్పించగా, పార్టీ వీడిన జీవన్ రెడ్డి తరచూ సీఎం శైలిపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉన్నారు. విజయశాంతి ప్రభుత్వ విధానాలపై పెదవి విప్పగా, కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ఏకంగా పరకాల టికెట్ కేటాయింపు, కుటుంబానికి ఎమ్మెల్సీ నిరాకరణ వంటి అంశాలపై సీఎం కుటుంబ సభ్యులను సైతం టార్గెట్ చేస్తూ స్వతంత్ర పోరుకు సిద్ధమవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. అసమ్మతి స్వరాలు పెల్లుబుకుతున్నప్పుడు వాటిని బుజ్జగించడం లేదా సమన్వయ కమిటీల ద్వారా పరిష్కరించడంలో అధిష్టానం, సీఎం స్థాయి సంప్రదింపులు కొరవడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీలను రాజకీయంగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు.. సొంత పార్టీ నేతల అసంతృప్తి వ్యాఖ్యలే ప్రతిపక్షాలకు ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. కేటీఆర్, హరీశ్ రావు వంటి విపక్ష నాయకులు కాంగ్రెస్ అసమ్మతి నేతల వ్యాఖ్యలనే కోట్ చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు. ముఖ్యమంత్రిగా పరిపాలనపై పట్టు సాధిస్తున్నప్పటికీ, సొంత గూటిలోని అసమ్మతిని ఒకే తాటిపైకి తీసుకురావడంలో రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపడం లేదన్నది స్పష్టమవుతోంది. తక్షణమే సమన్వయ యంత్రాంగాన్ని బలోపేతం చేసి, అంతర్గత కుమ్ములాటలకు తెరదించకపోతే.. ఈ అంతర్గత అసంతృప్తే ప్రభుత్వ ఉనికికి రాజకీయంగా గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం ఉంది.

# జర్నలిస్ట్ యూనియన్ నేత విరాహత్ అలీని పరామర్శించిన హరీష్‌రావు

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, బిఆర్ఎస్ నాయకులు కె. విరాసత్ అలీలను మాజీ మంత్రి, బిఆర్ఎస్ లెజిస్లేటర్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు శనివారం రాత్రి పరామర్శించారు. అమ్మ బషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, విరాహత్ అలీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. హరీష్ రావు వెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, బిఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎస్సీ, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

-మొదటిపేజీ తరువాయి

చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

# మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

-మొదటిపేజీ తరువాయి

టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్?లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్?'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్?పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు. మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది. చీఎ-65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీఎ-44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)

రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)

రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

**వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ :** ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్?ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్?ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు : కారిడార్లు: 7 దూరం: 122.9 కి.మీ స్టేషన్లు: 86 ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు ప్రయాణికులు: 12.42 లక్షలు

# కొండాకు పదవీ గండం



**వరంగల్ :** కొండా సురేఖ మంత్రి పదవి తొలగింపుపై రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. కొండా సురేఖ కుటుంబానికి వ్యతిరేకంగా అందరూ ఒక్కటయ్యారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కొండా సురేఖ కుటుంబ వ్యవహార శైలిపై పార్టీ హైకమాండ్ కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. అయితే కొండా సురేఖ మీద చర్యలు తీసుకుంటే కట్టుబాటు తప్పిన మిగిలిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే బీసీ కార్డుతో కొండా సురేఖ పార్టీని ఇరకాటంలోకి పెట్టే అవకాశముంది. అందుకే కొండా సురేఖ వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నాయకత్వం ఏదో ఒక చర్య మాత్రం తీసుకోవాలని చూస్తుంది.. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం సురేఖకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు ఆ వ్యాఖ్యలు తన కుమార్తె వ్యక్తిగతమని, తనకూ వాటికి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేస్తూ క్రమశిక్షణా సంఘానికి లేఖ రాశారు. మంత్రి పదవి నుంచి తొలగిస్తారా లేదా అనే అంశంపై పార్టీ హైకమాండ్ మరియు సీఎం రేవంత్ రెడ్డి తీసుకునే నిర్ణయంపై స్పష్టత రావాల్సి ఉంది. దళిత ఎమ్మెల్యేను అవమానపర్చిన సమయంలోనూ, ఇతర సామాజికవర్గం నేతలను కించపర్చినప్పుడు ఒక్కటవ్వని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ విషయంలో ఒక్కటవ్వడంపై కొంత వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది కానీ కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటే అందుకు కొంత పార్టీ సాహసం చేయాల్సి ఉంటుంది. మిగిలిన క్రమశిక్షణ తప్పిన రెడ్డి సామాజికవర్గం ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డితో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే అవి తప్పుడు సంకేతాలు వెళతాయి. తెలంగాణలో బలమైన బీసీ సామాజికవర్గంలో వ్యతిరేకత వస్తే అది రాజకీయంగా ఇబ్బందిగా మారుతుంది. అందుకే కొండా సురేఖ పై చర్యలు అంత సులువు కాదు. కాకుంటే ఇకపై ఎలాంటి దూకుడు గా వ్యవహరించకుండా కొంత కళ్లెం వేయవచ్చన్న అభిప్రాయం ఎక్కువ మందిలో ఉంది. కొండా సురేఖకు వ్యతిరేకంగా పదహారు మంది ఎమ్మెల్యేలు సీఎల్పీలో సమావేశమయ్యారు. కొందరు లోపాయికారీగా కొండాసురేఖకు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది. మరి కొండా వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందన్నది చూడాలి.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
23 ఆగస్టు 2026

## సంపాదకీయం



# రేషన్ బియ్యంతో దళారుల దందా

ఉచిత రేషన్ బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్కమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది.

వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు.

పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

# భారత్ ఏఐ సృష్టికర్తగా ఎదగాలి!

- వీఐటీ స్నాతకోత్సవంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా
- తల్లి చేతుల మీదుగా పట్టా అందుకున్న తనయుడు
- వైద్య విద్యలో సీట్ల కొరతపై ఛాన్సలర్ ఆందోళన
- 11,276 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం




**వేలూరు:** భారత్ కృత్రిమ మేధస్సు (ఏఐ)ను కేవలం వినియోగించే దేశంగా మాత్రమే కాకుండా, స్వయంగా సరికొత్త సాంకేతికతను సృష్టించే దేశంగా ఎదగాలని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పిలుపునిచ్చారు. తమిళనాడు వేలూరులోని వీఐటీ విశ్వవిద్యాలయం 41వ స్నాతకోత్సవానికి శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వీఐటీ ఛాన్సలర్ జి.విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో పట్టభద్రులైన విద్యార్థులకు ఆమె డిగ్రీ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వం, విద్యావంతులు కలిసి పనిచేస్తే సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని సీఎం రేఖా గుప్తా పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ, వ్యర్థాల నిర్వహణ లాంటి సమస్యలను ఐఐటీల భాగస్వామ్యంతో పరిష్కరించిన విధానాన్ని ఆమె గుర్తుచేశారు. విద్యార్థులు కూడా తమ నగరాల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపాలని కోరారు. 'ఇండియా ఏఐ మిషన్' ద్వారా కేంద్ర ప్రభుత్వం సెమీకండక్టర్లు, కంప్యూటింగ్, రోబోటిక్స్ రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతోందని వివరించారు. వైఫల్యాలకు భయపడకుండా పట్టుదలతో లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. దేశానికి అత్యంత విలువైన వనరు మేధో సంపత్తి అని, ప్రపంచం భారత సాంకేతిక సామర్థ్యాన్ని గుర్తించేలా చేయాలని పిలుపునిచ్చారు.

### వైద్య విద్యలో సీట్ల కొరత..

దేశంలో ఉన్నత విద్య స్థూల నమోదు నిష్పత్తి ప్రస్తుతం 30 శాతంగా ఉందని, దీనిని 50 శాతానికి పెంచాలని వీఐటీ ఛాన్సలర్ జి.విశ్వనాథన్ సూచించారు. దక్షిణ కొరియా, జపాన్, చైనాతో పోలిస్తే భారత్ మరింత పోటీ పడాలన్నారు. దేశంలో ఏటా 22 లక్షల మంది నీట్ రాస్తుంటే కేవలం 1.3 లక్షల వైద్య సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, దీంతో లక్ష మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో 17, కేరళలో 13 విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చొరవ తీసుకుని గవర్నర్లు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

### తల్లి చేతుల మీదుగా డిగ్రీ..

ఈ స్నాతకోత్సవంలో సీఎం రేఖా గుప్తా కుమారుడు నికుంజ్ గుప్తా కూడా పట్టా అందుకున్నారు. తన కుమారుడు డిగ్రీ సర్టిఫికెట్ తీసుకుంటున్న క్షణాలను సీఎం వేదిక కింద కూర్చుని గర్వంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11,276 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, 84 మందికి బంగారు పతకాలు అందజేశారు. అంతకుముందు రోజు సీఎం బ్యాక్టీరియోఫేజ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వందేమాతరంపై బీజేపీ కీలక తీర్మానం!

**జాతీయ పదాధికారుల సమావేశంలో ఆమోదం**

**రెండు చరణాలే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై అభ్యంతరం**

**దేశవ్యాప్తంగా వందేమాతరం ప్రచార యాత్రకు శ్రీకారం**



**న్యూఢిల్లీ:** 'వందేమాతరం' గేయ గౌరవ ప్రతిష్ఠలను కాపాడేందుకు ప్రవేశపెట్టిన కీలక తీర్మానానికి భారతీయ జనతా పార్టీ ఆమోదం తెలిపింది. శనివారం జరిగిన బీజేపీ నూతన జాతీయ పదాధికారుల సమావేశంలో 10 పాయింట్లతో కూడిన ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. వందేమాతరం గేయంలోని తొలి రెండు చరణాలను మాత్రమే పాడాలంటూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ ఈ సమావేశంలో తీవ్రంగా ఖండించింది. వందేమాతరం గేయంలోని పూర్తి 6 చరణాలను పాడి, దాని గౌరవాన్ని కాపాడుతామని బీజేపీ స్పష్టం చేసింది. ఈ క్రమంలో 2026 పార్లమెంట్ చట్టాన్ని కమలదళం గట్టిగా సమర్థించింది. సంకుచిత ఓటు బ్యాంకు రాజకీయాలకు వందేమాతరం బలికాదని తేల్చి చెప్పింది. జాతీయ గీత గౌరవ ప్రతిష్ఠలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేసిన బీజేపీ.. దాని చారిత్రక ప్రాముఖ్యతను, వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా 'వందేమాతరం' ప్రచార యాత్రకు శ్రీకారం చుట్టింది.

# 2035 నాటికి 'తేజస్ ఎంకే-2' సరిపోదు!

**స్వదేశీ ఫైటర్ జెట్‌పై మాజీ ఎయిర్ మార్షల్ నాగేశ్ కపూర్**



**న్యూఢిల్లీ:** స్వదేశీ యుద్ధవిమానం తేజస్ ఎంకే-2పై భారత వైమానిక దళం మాజీ ఉపాధ్యక్షుడు ఎయిర్ మార్షల్ నాగేశ్ కపూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2035 నాటికి ఇవి పెద్ద సంఖ్యలో అందుబాటులోకి వచ్చినా.. ఫ్రంట్‌లైన్ యుద్ధ సామర్థ్యానికి అవి సరిపోకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పదవీ విరమణ చేసిన రెండు నెలలకే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం రక్షణ రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

చైనా ఇప్పటికే ఆరో తరం యుద్ధవిమానాల వైపు అడుగులు వేస్తోందని, పాకిస్థాన్ సైతం ఐదో తరం జెట్లను పరిశీలిస్తోందని కపూర్ గుర్తుచేశారు. ఇలాంటి సమయంలో 2035 నాటికి భారత్ నాలుగో తరం విమానాలతో (తేజస్ ఎంకే-2) ఉండటం కార్యాచరణ పరంగా ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం మన వద్ద ఐదు, ఆరో తరం విమానాలు లేవని, చైనా మాత్రం 2030 నాటికి ఐదో తరం జే-20 విమానాలను 500కు పైగా మోహరించే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, తేజస్ ఎంకే-2 పూర్తిగా అనవసరం అని తాను అనట్లేదని.. అన్ని ప్రాంతాల్లో ఐదు, ఆరో తరం విమానాలను మోహరించడం సాధ్యం కాదు కాబట్టి వీటిని కొంతవరకు ఉపయోగించవచ్చని కపూర్ చెప్పారు. స్వదేశీ యుద్ధవిమానాల అభివృద్ధిని కొనసాగిస్తూనే.. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్న ఎఫ్‌సీఏఎస్ లేదా బ్రిటన్, ఇటలీ, జపాన్ కలిసి చేపడుతున్న జీసీఏపీ లాంటి అంతర్జాతీయ కార్యక్రమాల్లో భారత్ భాగస్వామి కావాలని ఆయన సూచించారు. ఇదే క్రమంలో, తేజస్ ఎంకే-1ఏ విమానాల సరఫరాలో హెచ్ఏఎల్ చేస్తున్న తీవ్ర జాప్యంపై మాజీ ఉపాధ్యక్షుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.

# నాలుగేళ్లలోపు పిల్లలకు ఆ మందులు వాడొద్దు

- రెండు రసాయనాలతో కూడిన ఔషధాలపై నిషేధం
- చిన్నారుల మందులపై కేంద్రం ఆంక్షలు!
- ప్యాకింగ్‌పై స్పష్టమైన హెచ్చరికలు ముద్రించాల్సిందే
- నిపుణుల కమిటీ సిఫార్సులతో కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** చిన్నారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్లోర్ ఫెనిరమైన్ మేలియేట్, ఫినైలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ అనే రెండు రసాయనాలతో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్ డీ సీ) మందుల తయారీ, విక్రయాలు, పంపిణీపై ఆంక్షలు విధించింది. నాలుగేళ్లలోపు పిల్లలకు ఈ మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని కేంద్రం స్పష్టం చేసింది.

కేంద్రం తాజా నోటిఫికేషన్ ప్రకారం.. ఈ రెండు రసాయనాలు కలిగిన అన్ని రకాల ఎఫ్ డీ సీ మందులకు ఈ నిబంధన వర్తిస్తుంది. ఇకపై ఈ మందుల తయారీదారులు ఔషధాల లేబుల్, ప్యాకేజీ ఇన్సర్ట్, ప్రచారాల్లో స్పష్టమైన హెచ్చరికలను ముద్రించాల్సి ఉంటుంది. నాలుగేళ్లలోపు చిన్నారులకు వీటిని ఉపయోగించరాదని వినియోగదారులకు తెలియజేయడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు (డీ టీ ఏ బీ) నిపుణుల కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మందుల వినియోగం వల్ల పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం వీటికి సురక్షితమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

కాగా, ఈ రెండు రసాయనాలతో కూడిన కొన్ని ఎఫ్ డీ సీ లపై కేంద్రం గతంలోనే చర్యలు తీసుకుంది. 2025 ఏప్రిల్ 15న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా నిర్దిష్ట మందులపై ఆంక్షలు విధిస్తూ.. నాలుగేళ్లలోపు పిల్లలకు వాటిని వాడకూడదనే హెచ్చరికను తప్పనిసరి చేసింది. అయితే, తాజాగా ఆ నిబంధనను ఈ రెండు పదార్థాలు కలిగిన అన్ని ఫార్ములేషన్లకు విస్తరించింది. ఈ నోటిఫికేషన్‌ను ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం 1940లోని సెక్షన్ 26 ఏ కింద జారీ చేశారు. అధికారిక గెజిట్‌లో ప్రచురితమైన తేదీ నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

# ఎం ఐ ఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ మోడల్ స్కూల్ లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎం ఐ ఎస్) ఉద్యోగుల సంఘం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఆసిఫాబాద్ గేడేకార్ సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా గేడేకార్ సంతోష్ కుమార్ (ఆసిఫాబాద్), ప్రధాన కార్యదర్శిగా ఇందారపు ప్రశాంత్ (సిర్పూర్-టి), కోశాధికారిగా కె. రాజ్‌కుమార్ (తిర్యాణి) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వై. అశ్విని (కెరమెరి), కె. సుమలత (బెజ్జూర్), ఆర్. సంతోష్ (సిర్పూర్-యు), పి. తుకారాం (జైనూర్), ఎ. శ్రీకాంత్ (కాగజ్‌నగర్), పి. రాజేష్ (దహెగాం), ఎ. కులాజీ (కౌటాల) నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖలో గత ఐదేళ్లుగా ఎం ఐ ఎస్ సిబ్బంది డేటా నిర్వహణ, విద్యా కార్యక్రమాల పర్యవేక్షణ, ప్రభుత్వ పథకాల అమలులో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎం ఐ ఎస్ సిబ్బంది సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు.

# కుక్కల బెడదతో ప్రజల భయాందోళన

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కలు చిన్నారులను కరవడంతో పాటు ద్విచక్ర వాహనాల వెంటపడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఒంటరిగా నడిచే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావు నగర్‌లో వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. ఈ క్రమంలో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలను పట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో గ్రామాల్లో కూడా వీధి కుక్కలను పట్టుకుని నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ కుక్కల సంఖ్య పెరిగిపోవడంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ వీధి కుక్కల బెడదను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# పీచర గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని పీచర గ్రామంలో శనివారం ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎ.సంతోష్, హెచ్‌ఎం.శ్రీకాంత్ హెచ్వి. స్వర్ణలత, ఏఎన్‌ఎం భారతి, ఆశా కార్యకర్తలు పార్వతి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల కేసులో పట్టాభి పోలీస్ కస్టడీ ముగింపు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం లింగాల గ్రామానికి చెందిన దేవరపల్లి పట్టాభికి శనివారం పోలీస్ కస్టడీ ముగిసింది. సైబర్ నేరాల కేసులో హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ఇటీవల పట్టాభిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గత ఏడు నెలలుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న పట్టాభి హైదరాబాద్‌లో అడుగుపెట్టగానే పోలీసులు వలపన్ని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న పట్టాభిని కేసు దర్యాప్తులో భాగంగా కోర్టు అనుమతితో పోలీసులు మూడు రోజులపాటు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. విచారణలో పలు కీలక అంశాలను పోలీసులు రాబట్టినట్లు సమాచారం. ఆస్ట్రేలియా పౌరులను లక్ష్యంగా చేసుకుని దేవరపల్లి పట్టాభి తన ముఠాతో కలిసి సుమారు రూ.వంద కోట్ల వరకు మోసానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. 'రిట్జ్ ఐటీ సొల్యూషన్స్' పేరుతో కాల్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు చూపిస్తూ ఆస్ట్రేలియా పౌరులను మోసం చేసి ఆర్థికంగా దోపిడీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. మోసాల ద్వారా సేకరించిన నగదును నేరుగా తమ ఖాతాల్లోకి మళ్లించకుండా, ఆస్ట్రేలియాలో ఉన్న భారతీయ విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం హవాలా, క్రిప్టో కరెన్సీ మార్గాల ద్వారా ఆ మొత్తాన్ని భారత్‌కు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. పోలీస్ కస్టడీ ముగియడంతో పట్టాభిని తిరిగి కోర్టు ముందు హాజరుపర్చి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉంది.

# ప్రశ్నించే వారిపై 'దిమాక్ నక్సలైట్లు' ముద్ర వేయడం అప్రజాస్వామికం

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రభుత్వ లోపాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిపై 'దిమాక్ నక్సలైట్లు' అంటూ ముద్ర వేయడం అప్రజాస్వామికమని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మండిపడ్డారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో డివైఎఫ్ఐ 4వ జిల్లా మహాసభలు శనివారం అట్టహాసంగా జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన కోట రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉండే ప్రశ్నించే హక్కును గౌరవించాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని విస్మరించిందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలు, బ్యాక్ లాగ్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని, పోలీస్, డీఎస్సీ, జేఎల్, డీఎల్, గ్రూప్-1 నుండి గ్రూప్-4 వరకు ఉన్న అన్ని ఖాళీలను వేగంగా నింపాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగం లభించే వరకు నెలకు రూ 5,000 చొప్పున భృతి చెల్లించాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌లను అమలు చేస్తూ 'రాజీవ్ యువ వికాస్' పథకాన్ని ప్రారంభించాలని, నియామకాలు కోర్టు కేసుల్లో చిక్కుకోకుండా వివాదాస్పద జీవోలను రద్దు చేయాలని సూచించారు. అలాగే స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. యువజన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తే, భవిష్యత్తులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టే పోరాటాలకు యువత భారీగా తరలివచ్చి విజయం సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికానంద్, గోడిసెల కార్తీక్, ఉపాధ్యక్షులు దుర్గం నికిల్, పురుషోత్తం, సహాయ కార్యదర్శి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు మంజుల, సవిత, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ పట్టణంలోని 18వ వార్డులో లబ్ధిదారులకు శనివారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ , కౌన్సిలర్లు కస్తూరి పుష్పలత , గోవింద్ లతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు ఈ స్మార్ట్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులు అందజేస్తున్నామని, ఇంకా తీసుకోని వారు వెంటనే తమ పరిధిలోని రేషన్ డీలర్‌ను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్లు మనుష, సచిన్, నాయకులు నిఖిల్ , రేషన్ డీలర్ నరసింహస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తాం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పేద, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ గిరిజన ప్రాంతాల విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. శనివారం ఉట్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీఓ మంద మకరందు, ఎస్పీ అఖిల్ మహాజన్ మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్ ప్యానెల్‌ను ప్రారంభించారు. అనంతరం దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, గిరిజన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, పుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.



ఆశ్రమ, గురుకుల పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీ సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ పేద, గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా సామర్థ్యాలను పెంపొందిస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలోని 400కు పైగా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో సుమారు రూ.20 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం మంత్రి, కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థినులకు ఏకరూప దుస్తులు, కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, ఆర్డీఓ మోహన్ సింగల్, డీటీడీఓలు అంబాజీ, నిహారిక, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంపై కీలక సమావేశం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన డీసీసీ అధ్యక్షుడి నియామకానికి సంబంధించి మందమల్లమ్మలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్ష నియామక కోఆర్డినేటర్‌గా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ సెక్రటరీ సివి.మోహన్ డీసీసీ అధ్యక్షుడి నియామక ప్రక్రియకు అబ్జర్వర్‌గా హాజరయ్యారు. టీపీసీసీ అబ్జర్వర్లుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, కాంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంటెస్టెడ్ ఎంపీలు, మున్సిపల్ చైర్మన్లు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులతో పాటు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. నూతన డీసీసీ అధ్యక్షుడి నియామకంపై వారి అభిప్రాయాలను సేకరించారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం, పార్టీని ప్రజల్లోకి మరింత శక్తివంతంగా తీసుకెళ్లేలా సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంపిక చేయడంపై సమావేశంలో చర్చించారు.



# ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- రాష్ట్ర క్రీడా శాఖ ప్రత్యేక కార్యదర్శి జమేష్ రంజన్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మించడంలో భాగంగా ప్రతి ఒక్కరికి శారీరక, భౌతిక అక్షరాస్యతపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర క్రీడా శాఖ ప్రత్యేక కార్యదర్శి జమేష్ రంజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ లోని షాప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా నోడల్ అధికారులతో ఫిజికల్ లిటరసిపై జిల్లా స్థాయిలో కార్యక్రమాలు అమలు చేయడంపై వర్చువల్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యజీవితంలో యోగ, క్రీడలు, నడక, వ్యాయామము తప్పనిసరి అని, ప్రతి ఒక్కరూ శారీరక, భౌతిక అక్షరాస్యత కలిగి ఉండాలని తెలిపారు. జిల్లాస్థాయిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ వారి అనుసంధానంతో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఫిజికల్ లిటరసీ కార్యక్రమం పై జిల్లా స్థాయిలో ప్రణాళిక కార్యచరణ, సమన్వయం, కార్యక్రమాల అమలు అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అశ్వక్ అహ్మద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడతామని తెలిపారు.




పాఠశాల విద్యాశాఖ, ఒలంపిక్ అసోసియేషన్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు, క్రీడా క్లబ్బుల సభ్యులను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, జిల్లా మాధ్యమిక విద్యాధికారి రాందార్ తదితరులు పాల్గొన్నారు.

# వారంలోగా మార్కెట్‌లో ఆక్రమణల తొలగింపు

- చిరు కూరగాయల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ చైర్మన్ హామీ

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ సర్ సిల్క్ ప్రాంతంలో గత 20 సంవత్సరాలుగా కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల సమస్యలపై మున్సిపల్ చైర్మన్ షేక్ షాహిన్ సుల్తానాతో శనివారం సానుకూల చర్చలు జరిగాయి. మాలి సంక్షేమ సంఘం కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు విజయ్, జనరల్ సెక్రెటరీ వసాకే హన్మంతు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాలి సంఘం పెద్దలు నాందేవ్, సోమయ్య, చిరు వ్యాపారులు, రైతులు మున్సిపల్ చైర్మన్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. కౌన్సిలర్లు జ్యోతి, బాబురావు, రాజు, తాజ్, సూరజ్ పాల్గొని వ్యాపారుల ఇబ్బందులను



చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ షాహిన్ సుల్తానా మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఆక్రమణలను వారం రోజుల్లో తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటివరకు కూరగాయల వ్యాపారులు రామ్ మందిర్ టెంపుల్ పక్కన కూర్చొని వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు. అలాగే హెల్పర్ వెల్ఫేర్ గ్రౌండ్ సమీపంలోని స్థలం వ్యాపారులకు అనుకూలంగా ఉంటే అక్కడ ప్రత్యేకంగా కూరగాయల మార్కెట్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ ఏర్పాటు అనంతరం వ్యాపారులకు తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు, లైటింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంతో చర్చలు విజయవంతంగా ముగిశాయి. తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చిన చైర్మన్, కౌన్సిలర్లకు చిరు కూరగాయల వ్యాపారులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం పెద్దలు దస్తగిరి, నాందేవ్, శ్రీకాంత్, చిరు వ్యాపారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** దివ్యాంగుల సమగ్ర వికాసం, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శనివారం ఉట్నూర్లోని కేబీ కాంప్లెక్స్‌లో మహిళా శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు ఎవరిపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను, పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన ఆధునిక పరికరాలు, సంక్షేమ పథకాలను అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. సమాజంలో వారు ఎవరిపైనా ఆధార పడకుండా ముందుకు సాగేందుకు ఈ ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, వారి సమస్యల పరిష్కారానికి ముందుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగులకు రూ.30.68 లక్షల విలువగల 26 ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్సీ దండె విఠల్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్, మంచిర్యాల మండలాల తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గుర్తించిన అనామోలీస్‌ను పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని సూచించారు.



నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాల సంబంధిత దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ణీత సమయంలోగా జారీ చేయాలని ఆదేశించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్ వ్యవహారాలను త్వరితగతిన పరిష్కరించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలనానరు. ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు రెవెన్యూ సంబంధిత పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ప్రణాళిక ప్రకారం నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ప్రణాళిక ప్రకారం చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శనివారం వేములవాడలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖలు



సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, పనులను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన మేరకు కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించారు. పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ



సమావేశంలో ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ భీమ్లా నాయక్, ఆలయ ఈవో రమాదేవి, ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, మోతిలాల్ స్థపతి, సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# న్యూ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ప్రారంభం



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్:** కాగజ్నగర్ మండలంలోని వంజిరి గ్రామపంచాయతీ పరిధిలోని న్యూ కాలనీలో మిషన్ భగీరథ పథకం ద్వారా నూతన పైప్‌లైన్ పనులు చేపట్టి శనివారం కాలనీ ప్రజలకు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందించి నీటి సరఫరాను ప్రారంభించారు. కాలనీ ప్రజలకు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఉప సర్పంచ్ భారత్, డీఈ రాజేష్, గ్రామ కార్యదర్శి శ్వేతరాణి, వార్డు సభ్యులు లక్ష్మి, పద్మ, గ్రామస్తులు గోపాల్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ఏరియాను సందర్శించిన డైరెక్టర్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు శనివారం సత్తుపల్లి ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో ఏరియా జీఎం ఎస్.వెంకటాచారితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కిష్టారం ఓపెన్‌కాస్ట్ ను సందర్శించి, అక్కడి క్యాంటీన్‌లో కార్మికులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి యాజమాన్యం అందిస్తున్న భోజనం సంతృప్తికరంగా, రుచికరంగా ఉంటోందని కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జేవీఆర్ సీహెచ్‌పీని సందర్శించి అక్కడ అధికారులతో సమావేశమై బొగ్గు రవాణాకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బొగ్గు రవాణా ప్రక్రియ, నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం ఎస్.వెంకటాచారి, ఎస్వో టూజీఎం బొల్లం శ్రీనివాసు, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ఎస్ఓఎం బి.రామకృష్ణ, ఏరియా ఇంజనీర్ కె.సోమశేఖర రావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, జేవీఆర్ సీహెచ్‌పీ ఎస్ఈ పి.సాయినాథ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ పి.సూర్య ప్రకాశ్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీనివాస్, కిష్టారం ఓసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# సాత్ నంబర్ గ్రామంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** మండలంలోని సాత్ నంబర్ గ్రామంలో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందాలనే ఉద్దేశంతో అర్హులైన పేద కుటుంబాలకు నూతన డిజిటల్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ సరుకులతో పాటు భవిష్యత్తులో అన్ని సంక్షేమ పథకాలను పొందడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరఫున ఎప్పుడూ కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షబ్బీర్, రేషన్ డీలర్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫామ్ ఆయిల్ తోటలను పరిశీలించిన క్లస్టర్ ఉద్యానవన అధికారి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని అచలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త ఫామ్ ఆయిల్ తోటలను బెల్లంపల్లి క్లస్టర్ ఉద్యానవన అధికారి అర్చన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫామ్ ఆయిల్ తోటలో పాటించాల్సిన మెళుకువలు, , సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మ్యాట్రిక్స్ ఆయిల్ ఫామ్ కంపెనీ సీఈఓ ఉదయ్ కుమార్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పేదలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. శనివారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా తీశారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంద పడకల కొత్త ఆసుపత్రి భవనం అందుబాటులోకి రావడంతో పాటు సుమారు 17 మంది వైద్యులు ఉన్నప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందకపోవడం బాధాకరమన్నారు. కొంత మంది వైద్యులు విధులకు సమయానికి హాజరు కావడం లేదని, మరికొందరు ముందుగానే విధుల నుంచి వెళ్లిపోతున్నారంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. నిరుపేదలు, సామాన్య ప్రజలు ప్రధానంగా ఆశ్రయించే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి పరిస్థితులు ఉండటం సరికాదన్నారు. ఆసుపత్రిలో మంచినీటి సదుపాయం సక్రమంగా లేకపోవడం, మృతదేహాలకు సకాలంలో పోస్టుమార్టం నిర్వహించకపోవడం వంటి సమస్యలపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. కొన్ని ధ్రువపత్రాల జారీ కోసం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల రేజర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాము కాటుకు గురైన అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, సుమారు రెండున్నర గంటల పాటు యాంటీ స్నేక్ వెనం అందలేదనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు. పరిస్థితి విషమించడంతో బాధితుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

# ప్రతిఒక్కరినీ గౌరవిద్దాం.. సంతోషంగా జీవిద్దాం

- హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సమాజంలో ప్రతిఒక్కరూ తోటి వారిని గౌరవిస్తూ సోదర భావంతో సంతోషంగా జీవించాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయమూర్తి నగేష్ భీమపాక అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలో కోర్ట్ ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జ్-కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ఎ.వీరయ్య, శారదాదేవి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి కోర్టు ఇంచార్జి జడ్జి కె.నిరోష, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సమాజంలో గొడవలు, కేసులకు మనలోని అహమే ప్రధాన కారణమని అన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఆలోచించి చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా స్నేహభావంతో మెలగాలని సూచించారు. ప్రజలు చైతన్యవంతంగా, శక్తివంతంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కోర్టుల్లో కేసుల వాయిదా కాలాన్ని తగ్గించి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని తెలిపారు. సింగరేణి కార్మికులు చీకటిలో భూమి పొరల్లో కష్టపడి దేశానికి వెలుగులు అందిస్తున్నారని, వారి శ్రమ ఎంతో గొప్పదని కొనియాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లో కోర్టు భవనాలు ప్రారంభం కావడంతో కేసుల పరిష్కారం మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాలో అవసరమైన న్యాయస్థానాలు, న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ప్లీడర్లు అందుబాటులో ఉన్నారని చెప్పారు. కేసుల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అంతకుముందు న్యాయమూర్తి నగేష్ భీమపాక మందమర్రి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయస్థానాల అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించాలి

- గ్రామాల్లో రాత్రివేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** ప్రజలకు మరింత చేరువగా, జవాబుదారీతనంతో పోలీసు సేవలు అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పోలీసు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఎస్పీ సిబ్బంది నిర్వహించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్‌ను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, డేటా నమోదు, దర్యాప్తులో పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, కేసుల ఛేదనలో ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరస్తులను త్వరగా పట్టుకోవాలని అన్నారు. రికవరీ శాతాన్ని పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని తెలిపారు. డయల్ 112కు సమాచారం అందిన వెంటనే పెట్రోలింగ్, బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని, యువత డ్రగ్స్ బారిన పడకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని అభినందించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- మద్నూర్ మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ సాయిలు
- నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక



**ఉద్యమ కెరటం, మద్నూర్:** మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మద్నూర్ మండల ఎంపీడీఓ పి.సాయిలు అన్నారు. కామారెడ్డి జిల్లా మద్నూర్ లో శనివారం నిర్వహించిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్యకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ఆడిట్ చేయించి, ఆడిట్ నివేదికను సర్వసభ్య సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్యకు రూ.5,86,413 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మండలంలోని మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరాలని, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. అనంతరం మద్నూర్ మండల సమాఖ్య నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తడిహిప్పర్గ గ్రామ సంఘానికి చెందిన షేక్ హసీనా బేగం, కార్యదర్శిగా మద్నూర్ తెలంగాణ బతుకమ్మ గ్రామ సంఘానికి చెందిన పాంచల్ ప్రేమల, కోశాధికారిగా రుసేగావ్ గ్రామ సంఘానికి చెందిన అనీసా బేగంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మద్నూర్ మండలంలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు, ఏపీఎం జగదీష్, సీసీలు, అకౌంటెంట్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం

బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ పెట్టం చంద్రశేఖర్



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** బహుజనుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేపడతామని బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జ్ పెట్టం చంద్రశేఖర్ అన్నారు. శనివారం మంచిర్యాలలో నియోజకవర్గ బహుజన సమాఖ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల స్థాయి కమిటీలతో పాటు బూత్ స్థాయి సభ్యులను ఎన్నుకున్నారు. బీఎస్పీ పార్టీలోకి పలువురు స్వచ్ఛందంగా చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమావేశంలో కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేపడతామని, బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ వర్కిళ్ల మల్లేష్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కడాసి రవీందర్, పెద్దపల్లి ఇన్‌చార్జ్ కళ్యాణ్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, నాయకులు సిలివేరి రాజేష్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ మండల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఎంపీడీఓ కృష్ణవేణికి కాంగ్రెస్ నాయకుల సన్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. జైనూర్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణవేణిను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షేక్ రషీద్ మాట్లాడుతూ జైనూర్ మండల అభివృద్ధికి ఎంపీడీఓ ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. జైనూర్ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గెడం గోపీచంద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుద్దాల శ్రీనివాస్, ప్రకాష్, సీనియర్ నాయకుడు అంబాజీరావు, నాయకులు షేక్ రహీం, షేక్ అబ్బు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

### అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం..!




ఇంటర్నెట్ డెస్క్: చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది. టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్ సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది. పిల్లల భద్రత, గోప్యతపై సోషల్ మీడియా కంపెనీలు పెద్ద సంఖ్యలో వ్యాజ్యాలను ఎదుర్కొంటున్న తరుణంలో టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీ కుదుర్చుకోవడం గమనార్హం. మరోవైపు 1998 నాటి బాలల ఆన్‌లైన్ గోప్యతా పరిరక్షణ చట్టం (జుర్రారా)తో పాటు.. వివిధ రాష్ట్ర చట్టాలను ఉల్లంఘించిందనే ఆరోపణలు రావడంతో ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా (వీమ్ఝ) సైతం కోర్టు విచారణలను ఎదుర్కొంటోంది.

### యాపిల్‌లో లేఆఫ్‌లు.. 'సిరి'పై ఎఫెక్ట్

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ దాదాపు 200 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. ఈ కోతలు ప్రధానంగా సిరి డిజిటల్ అసిస్టెంట్ విజన్ ప్రో హెడ్‌సెట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ విభాగాల్లో జరిగాయి. ఇందులో విజన్ ప్రో హార్డ్‌వేర్ విభాగం నుంచి దాదాపు 100 పోస్టులు, సిరి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాల నుంచి మరో 100 పోస్టులను తొలగించినట్లు తెలుస్తోంది. విజన్ ప్రో కోసం గేమింగ్ ఫీచర్లను డెవలప్ చేస్తోన్న విభాగాన్ని కంపెనీ పూర్తిగా మూసివేసింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ మార్పులు చేస్తున్నట్లు యాపిల్ స్పష్టం చేసింది. అయితే, సంస్థలో కొత్త ఉద్యోగాలను సృష్టించడంతో పాటు.. ఈ లేఆఫ్స్ వల్ల నష్టపోయిన సిబ్బంది సంస్థలోని ఇతర విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొంది. యాపిల్ ప్రస్తుతం సిరి కోసం సరికొత్త ఏఐ ఆధారిత వెర్షన్‌ను డెవలప్ చేస్తోంది. దీనికి సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరం కావడంతో, ప్రస్తుత బృందంలో మార్పులు చేపట్టింది. అలాగే యాపిల్ డివైజ్‌లలో ఏఐ ఫీచర్లను పర్యవేక్షించే ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ విభాగంలోనూ మార్పులు జరుగుతున్నట్లు సంస్థ తెలిపింది. మరోవైపు, విజన్ ప్రో కోసం ఇమ్మెర్సివ్ వీడియోలకు మిలియన్ డాలర్ల ఖర్చవుతోంది. కానీ దీని వినియోగదారుల సంఖ్య పరిమితంగా ఉండటంతో కంపెనీపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. అందుకే ఇకపై సొంతంగా నిర్మించే కంటెంట్‌ను తగ్గించి, ఇతర తయారీ సంస్థలను ప్రోత్సహించాలని యాపిల్ నిర్ణయించింది.

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్.. గాయత్రి గోపీచంద్-ట్రీసా జోడీకి కాంస్యం

**దిల్లీ:** ఇటీవలే అర్జున పురస్కారాలకు ఎంపికైన భారత మహిళల బ్యాడ్మింటన్ జోడీ పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్స్‌లో గాయత్రి జోడీ 21-18, 13-21, 8-21తో లియు షెంగ్షు, టాన్ నింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. తొలి గేమ్ పోరాడి గెలిచిన భారత ద్వయం తర్వాత రెండు గేమ్‌లను చేజార్చుకుంది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్ ఆరంభంలో భారత జోడీ 4-1 ఆధిక్యంలో నిలిచింది. తర్వాత చైనా ద్వయం దూకుడుగా ఆడి 7-7తో స్కోరును సమం చేసింది. తర్వాత పోరు నువ్వానేనా అన్నట్లు సాగింది. ఈ క్రమంలో ట్రీసా, గాయత్రి 16-18తో వెనుకబడినా.. గొప్పగా పుంజుకుని గేమ్‌ను గెల్చుకున్నారు. రెండో గేమ్‌లో చైనా జోడీ దూకుడు ప్రదర్శించి 5-2తో నిలిచినా భారత జోడీ పుంజుకుని 11-10తో ఆధిక్యంలోని నిలిచింది. తర్వాత లియు షెంగ్షు, టాన్ నింగ్ దూకుడు పెంచి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో హవా అంతా చైనా జోడీదే. భారత ద్వయం కనీస పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో ట్రీసా, గాయత్రి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు.




# మొబైల్ తయారీకి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలు

రూ.10,000 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకే అర్హత

**దిల్లీ:** దేశంలో మొబైల్ ఫోన్ల తయారీని పెంచడానికి, స్వదేశీ బ్రాండ్‌లను బలోపేతం చేయడానికి రూ.62,500 కోట్ల ప్రోత్సాహకాలతో తలపెట్టిన మొబైల్ ఫోన్ తయారీ పథకం (ఎంపీఎంఎస్) మార్గదర్శకాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు పరిగణిస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఎంపీఎంఎస్ పథకాన్ని 2 విభాగాలుగా విభజించారు. మొబైల్ ఫోన్ల తయారీకి ప్రోత్సాహకాలు ఇవ్వడం ఒకటైతే, దేశీయ మొబైల్ బ్రాండ్‌లకు మద్దతు ఇవ్వడం రెండోది. దేశీయంగా తయారీ/అసెంబ్లింగ్‌తో 2025-26లో రూ.10,000 కోట్ల టర్నోవర్ సాధించిన అంతర్జాతీయ మొబైల్ కంపెనీలూ ఈ పథకం కింద అర్హత పొందుతాయి. కనీసం 51% భారతీయ యాజమాన్యం కలిగిన ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యాన్‌ఫ్యాక్చరర్స్ (ఈఎంఎస్), మొబైల్ కంపెనీలకు 2025-26లో రూ.1000 కోట్ల టర్నోవర్ ఉన్నా ఈ పథకంలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. వీరికి ఒక సంవత్సరం పాటు జెస్టేషన్ పీరియడ్ కూడా లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న బ్రాండ్‌లు 2025-26 విక్రయాలకు అదనంగా ఏటా కనీసం రూ.5,000 కోట్ల అదనపు అమ్మకాలను సాధించాలి. అంటే 2026-27లో రూ.5000 కోట్లు, 2027-28లో రూ.10,000 కోట్లు, 2028-29లో రూ.15000 కోట్లు, 2029-30లో రూ.20,000 కోట్లు, 2030-31లో రూ.25,000 కోట్ల అదనపు విక్రయాలు అవసరం. కొత్త బ్రాండ్ అయితే, మనదేశంలో వార్షికంగా రూ.10,000 కోట్ల మొత్తం విక్రయాలను సాధించిన తర్వాతే ఈ పథక ప్రయోజనాలకు అర్హత ఉంటుంది. 2026-27, 2027-28 సంవత్సరాల్లో అర్హత కలిగిన విక్రయాలకు 2.75% ప్రోత్సాహకాలు ఇస్తారు. 2028-29, 2029-30 సంవత్సరాల్లో 2.50%, 2030-31లో 2.25% ప్రోత్సాహకం అందిస్తారు. డిస్‌ప్లే మాడ్యూళ్లు, బ్యాటరీలు, యూఎస్‌బీ కేబుల్ వంటి కీలక మొబైల్ విడిభాగాలను, మనదేశంలోనే స్థానికంగా సమీకరించే మొబైల్ కంపెనీలకు విక్రయాలపై అదనంగా 1.5% వరకు బోనస్ ఇన్సెంటివ్ లభిస్తుంది. ఈ పథకం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి అయిదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. దీని నిర్వహణను ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షిస్తుంది. మనదేశంలోనే పూర్తిగా రూపొందించిన - సొంత మేధోసంపత్తి హక్కులు కలిగిన సరికొత్త దేశీయ మొబైల్ ఫోన్లు, రాబోయే 10-14 నెలల్లో మార్కెట్‌లోకి రానున్నాయని అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. ఎంపీఎంఎస్ కింద దేశీయ బ్రాండ్లను ఎంపిక చేయడంలో ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని, విదేశీ ఫోన్లను కాపీ కొట్టే సంస్థలకు ఈ పథకంలో లబ్ధి చేకూరదని స్పష్టం చేశారు. ఎంపీఎంఎస్ పథకం ద్వారా వచ్చే అయిదేళ్లలో మొబైళ్ల ఉత్పత్తి విలువ దాదాపు రెట్టింపై రూ.39 లక్షల కోట్లకు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పథకం ద్వారా 60,000 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి.





## ముంబై ఇండియన్స్‌లో కీలక నియామకం

ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ తమ క్రికెట్ వ్యవస్థలో కీలక మార్పు చేసింది. మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్, ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంలో విశేష అనుభవం కలిగిన జుబిన్ భరూచాను డైరెక్టర్ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌గా నియమించింది. ముంబై ఇండియన్స్‌కు చెందిన బహుళ విభాగాల నాయకత్వం, సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి భరూచా పనిచేయనున్నారు. ఆటగాళ్ల అభివృద్ధి, పెర్ఫార్మెన్స్ ప్రోగ్రామ్‌లు, దీర్ఘకాలిక ప్రణాళికలను మరింత బలోపేతం చేయడం ఆయన ప్రధాన బాధ్యతలుగా ఉండనున్నాయి. ముంబైకి చెందిన మాజీ ఫస్ట్‌క్లాస్ బ్యాటర్ అయిన భరూచా గతంలో రాజస్థాన్ రాయల్స్ క్రికెట్ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా యువ ప్రతిభను గుర్తించడం, వారికి హై-పెర్ఫార్మెన్స్ స్థాయిలో శిక్షణ అందించడంలో ఆయనకు మంచి అనుభవం ఉంది. భారత క్రికెట్‌లో ప్రస్తుతం స్టార్ హోదా అనుభవిస్తున్న సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, వైభవ్ సూర్యవంశీ ఎదుగుదలలో భరూచా కీలకంగా వ్యవహరించారు. ముంబై ఇండియన్స్ తమ క్రికెట్ ఎకోసిస్టమ్‌లో ప్రతిభను గుర్తించి, దాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే విధానంపై దృష్టి పెడుతున్న నేపథ్యంలో భరూచా నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. యువ ఆటగాళ్ల అభివృద్ధితో పాటు ప్రస్తుత జట్టు ప్రదర్శనను మరింత మెరుగుపరచడంలో ఆయన అనుభవం ఉపయోగపడే అవకాశం ఉంది.







Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం






## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్-2026'లో భాగంగా శనివారం స్థానిక స్టేడియం వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ నిర్మూలనకు సమాజంలో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా జాతీయ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థల క్యూఆర్ కోడ్ అవగాహనకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బైక్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. ఈ బైక్ ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, మీదుగా అవగాహన కల్పిస్తూ తిరిగి ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి అక్టోబర్ 12 వరకు రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ సురక్ష మాస్ క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలను కేవలం రిమ్స్, ఉట్నూర్, బోథ్ ప్రధాన ఆసుపత్రులకే పరిమితం చేయకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలు, క్షయ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి తప్పని సరిగా హెచ్ఐవీ పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరికైనా పాజిటివ్ వస్తే బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతూ, ఏఆర్టీ కేంద్రాల ద్వారా ఉచిత చికిత్సను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఆదిలాబాద్ 14వ స్థానంలో ఉందని, రాబోయే రెండు నెలల కార్యాచరణ ద్వారా జిల్లాను పూర్తి 'సురక్షిత స్థానం'లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, యువతలో అవగాహన పెంచడంతో పాటు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ చేపడతామని, ప్రజలు 1097 హెల్ప్‌లైన్ నంబర్, క్యూఆర్ కోడ్ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, డీవైఎస్ఓ దయానంద్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నాగరాజు, ఐసీటీసీ కౌన్సెలర్లు, పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

# కోహినూర్ ఆశ్రమ పాఠశాలకు రూ.3.20 లక్షల ల్యాబ్ సామాగ్రి





**ఉద్యమ కెరటం, జైనూర్:** సిర్పూర్(యూ) మండలం కోహినూర్(బి) గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు ఆధునిక విద్యా సౌకర్యాలు అందించేందుకు యొట్టఫ్లెక్స్ ఏఐ సంస్థ రూ.3.20 లక్షల విలువైన ప్రయోగశాల సామాగ్రిని అందించింది. సంస్థ ప్రతినిధులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూసం నామదేవ్, సర్పంచ్ సిడం విజయలక్ష్మితో కలిసి శనివారం సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆరు నెలల క్రితం పాఠశాలను సందర్శించిన సంస్థ ప్రతినిధులు విద్యార్థులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు బయో సైన్స్, ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ సైన్స్ తదితర విభాగాలకు అవసరమైన ఆధునిక ప్రయోగశాల సామాగ్రిని సమకూర్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింభించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మారుమూల గిరిజన ప్రాంతంలోని విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాలు అందించేందుకు సహకరించిన సంస్థకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు ప్రసన్న, రూపారాణి, రతన్, సునీల్, జయేష్, భాస్కర్, వంశీ, రాజ్‌కుమార్, శ్రీకర్, రుత్విక్, సాహితి, దిలీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూసం నామ్దేవ్, పీడీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ భాగ్యలక్ష్మి, పి.లక్ష్మణ్, ఎం.అరుణ, అరవింద్, శశికళ, ఆర్.లక్ష్మణ్, దన్‌లాల్, పారు బాయి, జగన్, సుశీల్, నిర్మల, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు, పటేల్ లక్ష్మణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 25న కాకతీయ యూనివర్సిటీలో మెగా జాబ్ డ్రైవ్




**ఉద్యమ కెరటం, వరంగల్:** కాకతీయ విశ్వ విద్యాలయ స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా విశ్వ విద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్, వరంగల్ నిర్మాణ్ ఓఆర్‌జీ ఆధ్వర్యంలో ఈనెల 25న మెగా ఆఫ్-క్యాంపస్ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి విశ్వ విద్యాలయ సెనెట్ హాల్‌లో ఈ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాబ్ డ్రైవ్‌కు సంబంధించిన గోడపత్రికను శనివారం విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఆవిష్కరించారు. 2018 నుంచి 2026 మధ్య ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకుని జాబ్ డ్రైవ్‌కు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.25వేల వరకు ప్రారంభ వేతనం ఉంటుందని పేర్కొన్నారు. విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి జాబ్ డ్రైవ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సంస్థలు ఫ్రూజీస్ పరిధిలోని సదర్‌ల్యాండ్, సాగిలిటీ, డిజిటైడ్, ఎయిర్‌టెల్, క్వెస్ పరిధిలోని కియా మోటార్స్, ష్నైడర్, డిక్సన్‌తో పాటు లెన్స్‌కార్ట్, అపోలో, కన్సోర్టాక్స్, ఏఅండ్ సీ సొల్యూషన్స్, దిశా స్టాఫింగ్ తదితర సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎం.లింగయ్య, నిర్మాణ్ ఓఆర్‌జీ సెంటర్ మేనేజర్ బోట్లపాటి రాఘవ కుమార్, తీగల శ్రీకాంత్, నరేష్ తుప్పారి తదితరులు పాల్గొన్నారు. జాబ్ డ్రైవ్‌కు సంబంధించిన ఇతర వివరాల కోసం కాకతీయ విశ్వ విద్యాలయ వెబ్‌సైట్ www.kakatiya.ac.in లో సంప్రదించాలని సూచించారు.

# దోమల బెడద, వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలి

- **మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి**



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న దోమల బెడద, వీధిదీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని పలు వార్డుల్లో దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీ, డ్రైనేజీల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు వంటి చర్యలు చేపట్టాలని కోరారు. దోమలతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందునా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పనిచేయని వీధిదీపాలను వెంటనే మరమ్మతు చేయాలని, దీపాలు లేని ప్రాంతాల్లో కొత్త ఎల్ఈడీ లైట్లు, ల్యాంప్‌పోస్టులు ఏర్పాటు చేయాలని కోరారు. చీకటి ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ దోమల నియంత్రణ, వీధిదీపాల సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**ఉద్యమ కెరటం, హత్నూర:** ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అశ్వద్దామ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఉద్యోగులు ఒకే యూనియన్‌గా ఏర్పడి, డిపో గౌరవ అధ్యక్షుడిగా ఆవుల రాజిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో కార్యదర్శిగా వెంకట్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేఖర్, ముఖ్య సలహాదారుగా మాందాపురం శ్రీనివాస్, డిపో అధ్యక్షుడిగా నాగరాజు గౌడ్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రామాంజనేయులు, ప్రేమ్ కుమార్, శ్రీధర్ గౌడ్, శివకుమార్, గోపాల్, బిక్షపతి, జమీల్ మియా, వీరేశలింగం తదితరులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ డిపో ఉద్యోగుల ఐక్యత ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారికి న్యాయం జరిగేలా అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ రీజియన్ ఇంచార్జి మేడి రాధాకిషన్ రావు, రాష్ట్ర నాయకులు మాటూరి శాఖయ్య, అశ్వత్, అహ్మద్, సుబ్బారావు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మిరాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జంగం గ్రామంలో పారిశుద్ధ్య పనులు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో సర్పంచ్, పెందూర్ అనుసయా అర్జున్ ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని వీధులు, రహదారి పక్కన పేరుకు పోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. వర్షాకాలంలో చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో చెత్తను వేయకుండా, రహదారులు, కాలువల్లో వ్యర్థాలు పడేయకుండా గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను బాధ్యతగా తీసుకుంటే జంగం గ్రామాన్ని మరింత స్వచ్ఛంగా, ఆరోగ్యకరంగా తీర్చి దిద్దవచ్చని పేర్కొన్నారు.

# "చిరంజీవితో నా అనుబంధం ప్రత్యేకం

- **ప్రజారాజ్యంలో కలిసి పనిచేశాం"**
- **మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో వెలిచాల రాజేందర్ రావు**

**ఉద్యమ కెరటం,కరీంనగర్ :**

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. శనివారం మైత్రి హోటల్‌లో చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావు కేక్ కట్ చేసి చిరంజీవి అభిమానులకు స్వీట్లు తినిపించారు. అనంతరం అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. ప్రజారాజ్యం పార్టీలో ఉన్న సమయంలో చిరంజీవితో కలిసి పనిచేశామని, ఆ రోజుల్లో తమ మధ్య మంచి సాన్నిహిత్యం ఏర్పడిందని గుర్తుచేశారు. "చిరంజీవితో నాకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉంది. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేశాం. ఆయనతో మా కుటుంబానికి కూడా మంచి అనుబంధం ఉంది" అని రాజేందర్ రావు అన్నారు.మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో రాబోయే రోజుల్లో మరింతగా రాణించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ మెగాస్టార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ కార్పొరేటర్లుగుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, ఇక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంటమిడిదొడ్డి కపిల్ మాధవ, గాలిపెల్లి కుమార్ శ్రీనివాసు రావనవేని సంపత్, సముద్రాల రమణారావు, జల్లోజు శ్రీనివాస్, పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కనకరాజు, కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ రాకేష్, సలీం, కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం నిక్కచ్చిగా · UDYAMAKERATAM TELUGU DAILY · తెలుగు దినపత్రిక



# చిరు సినిమాకు కాకాగా టైటిల్

### బర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్




అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

# వివాహబంధంతో ఒక్కటైన అర్జున్ రాంపాల్,గాబ్రియెల్లా

బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు ఉత్తర గోవాలోని మపుసా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం. గోవాలో అమల్లో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ నిబంధనల ప్రకారం వీరి వివాహం నమోదు చేసినట్లు మపుసా సబ్-రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ వెల్లడించారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ 2018 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మాత్రం పెద్దగా బయటకు వెల్లడించలేదు.



# రాకా సినిమా కోసం ప్రత్యేక ప్రపంచం సృష్టి

### సినిమా షూటింగ్‌ను సందర్శించిన మంచు లక్ష్మి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అట్లీ తన గత చిత్రాలకు భిన్నంగా ఈసారి సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌ను ఎంచుకోవడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే అల్లు అర్జున్ లుక్, అట్లీ మేకింగ్ స్టైల్ గురించి రకరకాల వార్తలు వైరల్ అవుతుండగా.. తాజాగా నటి మంచు లక్ష్మి చేసిన కామెంట్స్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ఇటీవల మంచు లక్ష్మి 'రాకా' షూటింగ్ జరుగుతున్న సెట్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న చిత్రీకరణను చూసి తాను ఆశ్చర్యపోయానని ఆమె చెప్పకొచ్చారు. ముఖ్యంగా సినిమా కోసం సృష్టించిన ప్రపంచం, భారీ సెట్స్, విజువల్ ఎలిమెంట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తాను చూడని ఒక కొత్త ప్రపంచాన్ని అక్కడ చూశానని మంచు లక్ష్మి పేర్కొన్నారు. సినిమాలో భాగంగా కనిపించే కొన్ని జీవులు, ప్రాణుల డిజైన్లు కూడా తనను ఆశ్చర్యానికి గురిచేశాయని ఆమె వెల్లడించారు. దీంతో 'రాకా' సాధారణ యాక్షన్ సినిమా కాదనే విషయం మరింత స్పష్టమవుతోందనే చర్చ మొదలైంది. 'రాకా'ను సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు సినిమాలోని ప్రపంచం ఎలా ఉండబోతుందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కొత్త తరహా విజువల్స్, భారీ యాక్షన్ సీక్వెన్సులు, ఊహకు అందని క్రియేచర్స్‌తో దర్శకుడు అట్లీ ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప' సినిమాతో సొంతం చేసుకున్న క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్, అట్లీ కలిసి ఎలాంటి విజువల్ వండర్‌ను సృష్టించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మాత్రం మంచు లక్ష్మి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'రాకా'పై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి.







# నా హీరో మా అన్నయే

### చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ విషెస్

మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు.తన పాఠశాల రోజుల నుంచే అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బు÷-లలెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**